# పెద్దవాళ్ల పిచ్చిమాటలు

పి. వేణుగోపాలు గారు

రెండుగా వంగిన శరీరము, ముడుతలుపడిన మొగము, మొగముపయి వ్రేలాడు పీచువంటి తెల్లని వెండ్రుకలు, చేతిలో తనకంటె కొంచెము పొడవైన కఱ్ఱ కలిగి, రాలనున్న పచ్చనిపండుటాకు ఆమె. ఊరిచివర నొక గుడిసెలో కాపురము. ఇంటిలో తాను, చిన్న మనుమరాలు.

ఊరికి పడమట నొకకొండ యున్నది.

సాయంకాలపు లేత యెండ. చేతికఱ్ఱ పట్టుకొని, మీది మెట్లకు శిరస్సు తగులునో అన్నట్లు వంగినశరీరముతో ముదుసలి గబగబ కొండపయికి ప్రాకుచున్నది. ఇరుప్రక్కల నున్న వృక్షముల రామణీయకముగానీ, పక్షులకలకలముగాని ఆమెనాకర్షించుట లేదు. మధ్య మధ్య శిరస్సునెత్తి యింకెంత దూరమో యని చూచును. పయికి పోవుకొలది సూర్యరశ్మి స్వేదసిక్తములయిన ఆమె తెల్లని వెండ్రుకలపయి బడుటచే హిమవత్పర్వత శిఖరమువలె అవి తళతళ ప్రకాశించుచుండెను. పయికి పోయి నలువంకల చూడకయే దక్షిణముగాపోయి ఆమెఒక బండవద్ద నిలిచెను. తననేత్రములనుబండదగ్గఱకుచేర్చి, పోగొట్టుకొనిన సూదిని వెదకినట్లు బండనంతయు మరల మరల పరిశోధించి, పడమటవైపు తిరిగి ప్రొద్దు జూచి గృహోన్ముఖురాలాయెను.

ఈమె యిట్లు బండచుట్టు ఏమో వెదకుట ఒకదినము ఆప్రాంతమున గొఱ్ఱెలు మేపుకొను బాలురుచూచి, ఆమె వెళ్లినతర్వాత యేమైనా దాచిపెట్టినదని బండచుట్టు త్రవ్వి చూచిరి కాని యేమీ అగపడ లేదు. మరుసటి దినముకూడ ఆ వృద్ధురాలు అట్లు వచ్చి వెదకుట చూచి బాలురు ఆమెచుట్టు మూగి, "ఏమిటవ్వా, వెతుకుతున్నావు దినాన" అని అడిగిరి. ఆమె ఉత్తరము యివ్వక వెళ్లిపోవ చూచె కానీ బాలురు ఆమెను పోనివ్వక బలవంత పెట్టిరి. అంత ఆమె "ఏమీ లేదు. నాయనా వినండి. మా తండ్రి మృత్యుకాలమునందు నన్ను దగ్గఱకు పిలిచి, 'అమ్మా' మన ఊరికి పడమటివైపునుండు కొండపయి దక్షిణ భాగమునందు ఒక పెద్దబండ ఉన్నది. దానిపయి ఎప్పుడు రక్తబిందువులు పడునో ఆరాత్రి పెద్దప్రళయము వచ్చి యీ ఊరు కొట్టుకొనిపోవును. మీరు లేచి పోవలయును. జాగ్రత' అని చెప్పెను. మాతండ్రిగారికి వారి తండ్రి చెప్పెనట. ఇట్లు ఎన్నితరములనుండియో వచ్చుచున్నది. అందుచేత ప్రతిదినము సాయంత్రము నేను వచ్చి యీ బండను చూచిపోవుచున్నాను" అని చెప్పెను. బాలురందరు గొల్లున నవ్వుచుండ, ఆమె వినిపించుకొనకుండ తిరిగిపోయెను.

బాలురకు ఆమెను తమాషాచేయవలెనని పుట్టినది. మరుసటి దినము ఆమె వచ్చువేళకు ఉచ్చులువేసి కొన్ని పిట్టలను పట్టి తెచ్చి, వాని మెడలు విఱిచి—తమ తప్పిదము ఏమో ఆ పిట్టల కేమి తెలియును, ఎట్టి తప్పులకు అట్టి శిక్ష విధించెనో పేమస్వరూపుడగు భగవంతుడు—బండనంతయు రక్తసిక్తము చేసిరి. తాము ఒకమూల దాగిరి.

ఎప్పటివలె ముసలిది వచ్చెను. బండ రక్తమయమై ఉండుట చూచెను. ఆమెగుండె లదిరెను. శరీరము కంప మెత్తెను. ఇంక అక్కడ నిలువలేను. ఒక్క విసరున ఇంటికి మరలినది. గుండె బాదుకొనుచు, యేడ్చుచు, 'ప్రళయము వస్తుంది. ఊరంతా లేచిపోండి' అని అఱచుచు, పిచ్చియెత్తినదానివలె ఇంటికి పరుగెత్తి, కుండ చట్టి మూటకట్టి నెత్తిన పెట్టుకొని, మనుమరాలిని తీసుకొని, ప్రళయము తన్ను వెన్నంటి వచ్చుచున్నట్లే పరుగెత్తెను. 'ప్రళయము, లేచిపోండి' అన్నమాట తప్పితే యితరులకు నిలిచి జవాబు కూడ చెప్పలేదు. ఊరి ప్రక్కన కొండపైనున్న శిథిలమంటపము చేరిన తర్వాత అమెమనస్సు స్తిమితపడెను.

బాలురు తమ యత్నము సఫలమైనందుకు గర్వపడిరి. బాలుర తెలివిని మెచ్చుకొను పెద్దమనుష్యులు కొందఱు; 'బలే తమాషా' అని కొందఱు; 'పాపము' అని పశ్చాత్తాపము జెందువారు కొందఱు. ఇరుగు పొరుగువారు భుజించి వెన్నెలబయట పండుకొని, ముసలిదానికై వగచి తెల్లవాఱి ఆమెను పిలిచికొని రావలెనని అనుకొనిరి. ఊరంతయు ఆమె ప్రసంగమే చేయుచు, పిండి ఆరబోసినట్లు వెన్నెల కాయుచుండగా, పడుకొని నిద్రపోయిరి.

అర్థరాత్ర మయినది. చంద్రుడు మఱుగుపడి, చిమ్మచీకట్లు కమ్మినవి. పెనుగాలి వీచెను. దుమ్మదుమారము రేగెను. ఇండ్లకప్పులు ఎగిరిపోయెను. అందఱు 'గీ, గా' అని అఱచిరి. ఆకాశము గర్జించినది. మెఱిసినది. కుంభవర్షము కురిసినది. ఇండ్లు వాకిళ్లు కూలినవి. ప్రవాహములో కొట్టుకొని పోయినవి.

వృద్ధురాలుకూడ ఊరిలో అఱపులు వినెను.

(జపాను మ్యాగజైను నుండి)